క్లుప్తంగా

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆదివారం పిచ్చికుక్కలు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఆదివారం ఒక్కరోజే 15 మందిపై దాడి చేసి గాయపర్చడంతో కాలనీవాసులు బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. గాయాలపాలైన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్కలను పట్టుకునేందుకు సోమవారం ప్రత్యేక బృందాలు రప్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

చింతలమానెపల్లి: మండలంలో రణవెల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న ఒకరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రణవెల్లి గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన చాపిడె రత్నక్క గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా 5లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా పద్మశాలి సంఘం ఎన్నికలు

కాగజ్‌నగర్‌రూరల్: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలను ఆదివారం పట్టణంలోని ద్వారకానగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించారు. మొత్తం 196 ఓట్లకు 72 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎక్కలదేవి నాగరాణి తెలిపారు. ఎన్నికల సామగ్రిని జోనల్ అధికారి గోలి వినోద్‌కుమార్‌కు అప్పగించామన్నారు. ఎన్నికల సామగ్రిని హైదరాబాద్‌లోని కౌంటింగ్ హాల్‌కు తరలించనున్నట్లు తెలిపారు. సోమవారం వనస్థలిపురంలోని కర్నాటి ఫంక్షన్‌హాల్‌లో కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి దాసరి శ్రీకాంత్, పోలింగ్ అధికారి సంపత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

‘చోద్యం చూస్తున్న పాలకవర్గ సభ్యులు’

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్వే నెం.147/2 కబ్జాకు గురవుతుంటే పాలకవర్గ సభ్యులు, మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారని బీజేపీ నాయకులు గోలెం వెంకటేశం ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వే నెం.147/2లో ఉన్న మొత్తం భూమికి ఫెన్సింగ్, ప్రహరీ ఎందుకు నిర్మించడం లేదన్నారు. ఇల్లు లేకపోయినా ఉన్నట్లుగా నెంబర్ కేటాయించడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. సర్వే నంబర్‌పై పూర్తి విచారణ జరిపి సంబంధిత స్థలాన్ని కాపాడకుంటే బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఆసిఫాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఉపయోగపడతాయని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఉబెద్‌బిన్ యాహియా అన్నారు. ఆదివారం మండలంలోని మోతుగూడ గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలోని ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు పెంచుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు కాంద్రే విశాల్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పుల్లూరి శంకర్, సభ్యులు నాంపెల్లి శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం సిర్పూర్(టి) మాజీ జెడ్పీటీసీ అజ్మీరా రాంనాయక్, జాగృతి మహిళా మండల అధ్యక్షురాలు విజయ, మరుగుజ్జు సంఘం జిల్లా అధ్యక్షులు పిప్ర లాలాజీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల వల్ల పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం



కెరమెరి: పిడుగుపాటుతో మృతి చెందిన మండల కేంద్రంలోని బారేవాడకు చెందిన చౌదరి రమేశ్ కుటుంబానికి ఆదివారం కెరమెరి మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ నాయకులు రూ.6 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కావ్‌డే తుల్సీరాం, ఆదే శ్యాంరావు, మనోహర్, చందు, సోమా, నారాయణ, తిరుపతి, సోనారావు, నాగు తదితరులు ఉన్నారు.

కుక్కలు.. గుంపుగా వస్తాయ్



ఖమాన గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

- సర్వేలో 640 వీధి కుక్కల గుర్తింపు
- ప్రతీ నెల కుక్కకాటు కేసులు నమోదు
- కానరాని నియంత్రణ

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం, పారిశుధ్యం కార్యక్రమాలతో పాటు వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. కుక్కల లెక్క పక్కాగా రూపొందించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ అధికారులు సర్వే చేసి మండలంలో మొత్తం 640 వీధి కుక్కలు ఉన్నట్లు జాబితా రూపొందించారు. శునకాల సర్వే పూర్తయ్యి 10 రోజులు గడిచినా వాటి నియంత్రణకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

గుంపులుగా సంచారం..

వీధి కుక్కలు గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తూ మనుషులు, పశువులపై దాడికి పాల్పడుతున్నాయి. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న కుక్కలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా గాయపరుస్తున్నాయి. మనుషులపైనే కాకుండా ఒంటరిగా ఉండే పశువులపై కూడా గుంపులుగా దాడి చేస్తున్నాయి. మండల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీ నెల పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. జూన్‌లో 10, జూలైలో 7, ఈ నెలలో ఇప్పటికే 6 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ఇవి ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదైన కేసులు మాత్రమే.

నామమాత్రపు లెక్కలేనా..

ఈనెల 8వ తేదీన నిర్వహించిన సర్వేలో మండలంలో మొత్తం 640 వీధికుక్కలు ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కలు నామమాత్రంగా వేసినవేనని మండల వాసులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో, వీధుల్లో తిరుగుతూ సర్వే నిర్వహించాల్సిన అధికారులు కూర్చున్న చోటు నుంచే వేళ్లపై లెక్కలు వేసుకొని కుక్కల సంఖ్యతో కూడిన జాబితాను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. బెండార గ్రామ పంచాయతీలో 5, చిచ్‌పల్లిలో 4, చౌపన్‌గూడలో 8, సామేలలో 4, తేజాపూర్‌లో 6 వీధి కుక్కలు మాత్రమే ఉన్నట్లు సర్వే రిపోర్టులో పేర్కొన్నారు. మిగతా జీపీల్లో ఉన్న శునకాల కంటే చాలా తక్కువగా జాబితాలో నమోదు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సర్వే లెక్కలు ఇలా..

సర్వే ప్రకారం బంబారలో 30, బెండారలో 5, చిచ్‌పల్లి -4, చౌపన్‌గూడ -5, ధాబా -15, దొడ్డిగూడ -15, గోయేగాం- 16, ఇందాని -54, జైత్‌పూర్- 14, జంబుల్‌ధరి -20, కనర్‌గాం -16, ఖమాన -53, ఖిరిడి -19, కోమటిగూడ -23, లక్ష్మిపూర్ -16, లెండిగూడ -10, నవేధరి -45, నవేగాం -28, నవేగూడ -16, పాటగూడ -10, పిప్పర్‌గోంది -15, సామేల -4, సరాండి -30, సవాతి -14, సోనాపూర్ -60, తెజాపూర్ -6, వెల్గీ-30, వాంకిడి కలాన్ -63 కుక్కలు ఉన్నట్లు పేర్కొన్నారు.

గుంపులుగా సంచారం



గ్రామంలో కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయందోళనకు గురి చేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం మా వీధిలో రెండు కుక్కలు పలువురిపై దాడి చేశాయి. అధికారులు త్వరగా నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

– జాడి మనోహర్, ఖమాన

తూతూ మంత్రంగా సర్వే



అధికారులు నిర్వహించిన వీధి కుక్కల సర్వే తూతూ మంత్రంగా నిర్వహించారు. ఖిరిడి గ్రామ పంచాయతీలో వీధి కుక్కల సంచారం విపరీతంగా ఉంది. కానీ పంచాయతీ అధికారులు మాత్రం నామామాత్రపు సర్వే నిర్వహించి లెక్కలు చూపించారు. ఇంత పెద్ద జీపీలో 19 శునకాలు మాత్రమే ఉన్నట్లు చూపెట్టడం విడ్డూరంగా ఉంది.

– దినేకర్, ఖిరిడి

అందని ద్రాక్షలా పశువైద్యం



కెరమెరిలోని పశువైద్య కేంద్రం

కెరమెరి: మండలంలో ఒకే ఒక్క పశువైద్యం కేంద్రం ఉండడంతో మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. భౌగోళికంగా అతి పెద్ద మండలం కావడంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బంది పశువులకు వైద్యం అందించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా సబ్ సెంటర్ల ఏర్పాటును గాలికొదిలేసింది. దీంతో మండలంలోని మూగజీవాలు, పశువులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు, 146 గ్రామాలు ఉన్నాయి. మొత్తం 53028 మూగజీవాలు, పశువులు ఉన్నప్పటికీ ఒకే పశువైద్యం కేంద్రం ఉండడంతో పశువులకు వైద్యం చేయించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కలగా మారిన సబ్‌సెంటర్ల ఏర్పాటు..

గత కొన్నేళ్లుగా మండలంలోని నిసాని, ఖైరీ, అనార్‌పల్లి గ్రామాల్లో సబ్‌సెంటర్లను ఏర్పాటు చేయాలని మండల సభల్లో తీర్మానాలు చేస్తున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. రెండు వేల నుంచి మూడు వేల మూగజీవాలకు ఒక సబ్ సెంటర్ ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని ఒకే ఒక్క పశువైద్య కేంద్రంలో అసిస్టెంట్ పశువైద్యాధికారి, ఒక అటెండరు విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పశువైద్యాధికారి పోస్టు ఖాళీగానే ఉంది.

మండలంలోని మూగజీవాల వివరాలు..



పశువులు	18507
గేదెలు	624
మేకలు	33253
గొర్రెలు	644

వైద్యం అందడం లేదు



కెరమెరి మండలం విస్తీర్ణంలో పెద్దది కావడంతో పశువులకు అనుకున్న సమయంలో వైద్యం అందడం లేదు. సబ్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో పాడి రైతులు విన్నవిస్తున్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– పెందోర్ మోతీరాం, మాజీ ఎంపీపీ

వాగొస్తే వైద్యం బంద్



కెరమెరికి వెళ్లాలంటే దారి మధ్యలో అనార్‌పల్లి వద్ద పెద్ద వాగు ఉంది. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో జబ్బు చేసిన పశువులకు వైద్యం అందడం లేదు. మా గ్రామానికి దగ్గరలో సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలి.

– కుమురం బొజ్జు, కరంజివాడ

సీఐ, ఎస్సైని సన్మానించిన నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌటాల సీఐ ముత్యం రమేశ్‌ను బీఆర్‌ఎస్ మండల నాయకులు సన్మానించారు. కౌటాల సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సీఐ పేర్కొన్నారు. అలాగే ఉత్తమ ఎస్సైగా ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై మధుకర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగపురే బండు, సందీప్, నవీన్, సంజీవ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



సీఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్ రోడ్డుపై గల గుంతల్లో నిలిచిన బురద నీటిలో నిల్చొని బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి వరకు ప్రధాన రహదారిపై అడుగడుగున గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఏళ్లుగా రోడ్డుపై భారీ గుంతలు ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగపురే బండు, సందీప్, నవీన్, సంజీవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

జైనూర్: రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ ప్రాంత హక్కుల సాధనకు ఐకమత్యంగా పోరాడాలని గోండ్వాన రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు మార్లవాయి రాయిసెంటర్ సార్మేడి జుగ్నక దేవురావు అన్నారు. ఆదివారం మార్లవాయిలో ఆయా రాయిసెంటర్‌ల సార్మేడీలు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసేలా కార్యచరణ రూపొందించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యంపై ప్రభుత్వాలు దృష్టి సారించి పెసా గ్రామసభ ఆమోదంతో ఆదివాసీ గూడాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ద్వారా ఆదివాసీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయడంతో పాటు స్వయం ఉపాధి కోసం రుణాలు అందించి జీవనోపాధికి సహకరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత భూములు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని ఆదివాసీలకు అప్పగించాలన్నారు. ఎస్టీ జాబితా నుంచి వలస వచ్చిన లంబాడీలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ సార్మేడీ మెస్రం దుర్గు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సార్మేడీలు మోతీరాం, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు, సార్మేడీలు మెస్రం బాదిరావు, మక్తు ర్‌షావు, సోయం గంగారామ్, ఆత్రం ఆనంద్‌రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు దేవేందర్, వెంకటేశ్, ఆత్రం ఆనంద్‌రావు, మోహన్, నాయకులు మడావి భీంరావు, రాహుల్, శ్యామ్‌రావ్, అంబాజీ, ఆత్రం అనిల్, ఆత్రం ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

నిందితులను శిక్షించాలని కొవ్వొత్తుల ర్యాలీ



కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

కాగజ్‌నగర్‌రూరల్: ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు నిరసన తెలుపుతూ, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులకు శిక్షపడేలా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ భవనం



పగుళ్లు తేలిన తహసీల్దార్ కార్యాలయ భవనం



గచ్చుపై నీరు నిండగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలిక భవనాలలో నిర్వహిస్తున్నారు. మండలం ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్నా శిథిలావస్థకు చేరుకున్న భవనాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం పగుళ్లు తేలి అధ్వానంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత భవనం మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని మండల గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొగలుల కాలంలో స్వయం పాలన కోసం పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అన్నారు. మాజీ ఎంపీపీ విశ్వనాథ్, మాజీ సర్పంచ్ మౌనిశ్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, గౌడ సంఘం నాయకులు సత్యనారాయణ గౌడ్, రవీందర్‌గౌడ్, నవీన్‌గౌడ్, అంజన్న గౌడ్, వినోద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. కూలిన చెట్టు



దహెగాంలో కురుస్తున్న వర్షం



కౌటాలలో కూలిన చెట్టు

కౌటాల: మండలంలో ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని రవి జిరాక్స్ సెంటర్ షాపు వద్ద గల కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్టు నేలకొరిగింది. చెట్టు ప్రధాన రహదారితో పాటు ఉపయోగంలో లేని ట్రాక్టర్ ఇంజన్‌పై పడింది. చెట్టు పడిన సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో మండల కేంద్రంలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్డుపై చెట్టు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ సిబ్బంది చెట్టును రోడ్డుపై నుంచి తొలగించారు.

దహెగాంలో భారీ వర్షం

దహెగాం: గత నాలుగు రోజుల నుంచి ఉక్కపోతతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. భారీ వర్షం కురువడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు ఇళ్లకు మధ్యలోనే తిరిగి వచ్చారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామానికి చెందిన గర్భిణికి ఆదివారం 108 వాహనంలో సిబ్బంది ప్రసవం చేశారు. ఖర్జెల్లి గ్రామానికి చెందిన మాల్‌కార్ ఉనీకి పురిటి నొప్పులు రావడంతో భర్త ప్రకాశ్ 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మండలంలోని డబ్బా గ్రామం సమీపంలో ప్రసవం జరిగింది. తల్లి, ఆడ శిశువు క్షేమంగా ఉన్నట్లు కౌటాల 108 ఈఎంటీ విజయ్ తెలిపారు. వీరిని చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.